# మెచ్చాను మంచి మెజార్టీతో

# గెలిపించాలి

## రైతురాజ్యం కేసీఆర్‌కే సాధ్యమైంది..



- కేసీఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం
- కేసీఆర్‌కు అండగా ఆశీర్వదించాలి
- ఒక్క రైతులకే లక్ష కోట్లు ఖర్చు
- తెలంగాణా నుంచి కాంగ్రెస్‌ను పారదోలాలి
- వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..
- మూడోసారి కేసీఆర్ సీఎం ఖాయం
- పామాయిల్ అభివృద్ధికి అగ్రస్థానం
- బీఆర్ఎస్ లోక్ సభ పక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంటు సభ్యులు నామ నాగేశ్వరరావు
- అశ్వారావుపేటలో విలేకరుల సమావేశం.. పాల్గొన్న ఎమ్మెల్యే, అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు



**అశ్వారావుపేట, నవంబర్07(కెరటం ప్రతినిధి)**

రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీకి, సీఎం కేసీఆర్‌కు ప్రజలు మద్దతుగా నిలిచి బ్రహ్మరథం పడుతు న్నారని బీఆర్ఎస్ లోక్ సభ పక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంటు సభ్యులు నామ నాగేశ్వరరావు అన్నారు. అశ్వారావుపేటలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ నామ ఈ సందర్భంగా అశ్వారావుపేటలో జరిగిన విలేకరుల సమావే శంలో మెచ్చాతో కలసి మాట్లాడారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, మూడోసారి కెసిఆర్ అత్యధిక మెజారిటీతో గెలవబోతున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు ప్రవేశపెట్టి, విజయవంతంగా అమలు చేసిన ఘనత కెసిఆర్‌కి దక్కుతుందన్నారు. రైతు బంధు పథకం పెట్టి 73 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేయడం ఒక చరిత్ర అన్నారు. దాదాపు రైతులకు సంబంధించి వివిధ పథకాల కింద లక్ష కోట్ల వరకు ఖర్చు చేశారని చెప్పారు. యావత్ రైతాంగం మొత్తం కెసిఆర్ కు అండగా ఉందన్నారు. అనేక సంక్షేమ పథకాల ద్వారా రైతు రాజ్యాన్ని సాకారం చేశారని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలు సంక్షేమ కార్యక్రమాలుతో పచ్చ పడుతున్న రాష్ట్రాన్ని చూసి మిగతా పార్టీలకు కన్ను కుట్టిందన్నారు. వారు చెప్పే మాయమాటలు నమ్మి మోసపో వద్దని, ప్రజలంతా ఆలోచించాలని అన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో బ్రహ్మాండంగా ఉందని, మూడోసారి ప్రభుత్వం ఏర్పడగానే దానిని ఘనంగా అమలు చేసుకుం దామని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్యం అభివృద్ధికి పెద్దపీట వేశారని తెలిపారు .పార్లమెంట్లో ఎన్నడూ తెలంగాణ గురించి, తెలంగాణ ప్రజల సమస్యల గురించి, తెలంగాణ ప్రజల బాగోగులు గురించి ఏనాడు మాట్లాడని రాహుల్ గాంధీ ఈరోజు ఇక్కడకు వచ్చి అవాకులు చవాకులు పేలుతూ పచ్చి, అబద్దాలు మాట్లాతు న్నారని అన్నారు. పార్లమెంట్లో వ్యవసాయ బిల్లును అడ్డుకున్నానని రాహుల్ చెప్పడం విడ్డూరంగా ఉందని , అసలు ఆయన పార్లమెంట్ కే రాలేదని తెలిపారు . కాంగ్రెస్ పార్టీని తెలంగాణ నుంచి పారదోలాలని పిలుపు నిచ్చారు .త్వరలో జరిగే అశ్వారావుపేట ప్రజా ఆశీర్వాద సభ కు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని నామ విజ్ఞప్తి చేశారు .రైతుబిడ్డగా రైతుల సమస్యలు దగ్గరగా చూశానని చెప్పారు. నీళ్లు , కరెంట్, పెట్టుబడి లేక అప్పులు చేసి రైతులు ఆత్మహత్య చేసుకున్న చరిత్ర గతంలో ఉండేదని , కెసిఆర్ వచ్చిన తర్వాత పరిస్థితి బాగుపడిందన్నారు. రైతు సంక్షేమ రాజ్యం తీసుకు వచ్చారని చెప్పారు.దేశంలోనే కాదు ప్రపంచంలో ఎక్కడా లేనటువంటి రైతు సంక్షేమ పథకాలు తెలంగాణలో ప్రవేశపెట్టడం జరిగిందని నామ తెలిపారు.

సీఎం కేసీఆర్ పామాయిల్ సాగు ప్రధమ ప్రాధాన్యత ఇచ్చి అన్ని విధాల ఆదుకుంటామని చెప్పారు. రానున్న కాలంలో 10 లక్షల ఎకరాల్లో పక్కా ప్రణాళికతో పామాయిల్ సాగుకు చర్యలు తీసుకోవడం జరిగిందని చెప్పారు .అందులో భాగంగా పది పన్నెండు పామాయిల్ ఫ్యాక్టరీలకు శంకుస్థాపన చేయడం జరిగిందని నామ చెప్పారు. రానున్న ఎన్నికల్లో మెచ్చా నాగేశ్వరరావు ను మంచి మెజార్టీతో గెలిపించి, అసెంబ్లీకి పంపించాలని నామ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

**ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లు పరిశీలన**

ఈ సందర్భంగా ఎంపీ నామ నాగేశ్వరరావు స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావుతో కలసి అశ్వారావుపేట సీఎం ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలించారు. సభ విజయవంతానికి పార్టీ నాయకులకు నామ పలు సూచనలు చేశారు. భారీగా తరలివచ్చి, సభను జయప్రదం చేయాలని నామ ప్రజలను కోరారు.

# నేడు కూనంనేని నామినేషన్



- లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డు నుండి ప్రదర్శన
- తరలి రావాలని శ్రేణులకు పిలుపు
- హాజరుకానున్న నారాయణ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**కొత్తగూడెం, నవంబర్07(కెరటం ప్రతినిధి)**

సిపిఎం, కాంగ్రెస్ ఇతర ప్రజా సంఘాలు బలపరిచిన సిపిఐ అభ్యర్థిగా, పార్టీ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు బుధవారం నామినేషన్ వేయనున్నారు. కాంగ్రెస్, సిపిఐ ఒప్పందంలో భాగంగా కొత్తగూడెం స్థానాన్ని సిపిఐకి కేటాయించిన విషయం విధితమే. సిపిఐ రాష్ట్ర సమితి కూనంనేనిని అభ్యర్థిగా ప్రకటించారు. నామినేషన్‌ను పురస్కరించుకుని లక్ష్మి దేవిపల్లి మార్కెట్ యార్డు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్పషా తెలిపారు.

**పాత్రికేయునిగా ప్రస్థానం:**

డిగ్రీ పూర్తి చేసిన తర్వాత కూనంనేని ప్రస్థానం పాత్రికేయునిగా ప్రారంభమైంది. విశాలాంధ్ర హైదరాబాద్ లో ఆయన సబ్ ఎడిటర్ ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. 1980 దశకంలో కొత్తగూడెంలో విశాలాంధ్ర విలేకరిగా పనిచేసేందుకు వచ్చిన ఆయన అత్యంత చురుకుగా వ్యవహరిస్తూ అనతి కాలంలోనే సమస్యలపై అవగాహన పెంచుకుని ఆయన రాసిన వార్తలు అప్పట్లో తీవ్ర చర్చనీయాంశలయ్యాయి. పార్టీ సభ్యునిగా అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించిన కూనంనేని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శిగా ఎన్నిక య్యారు. 1987లో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో కొత్త గూడెం మండల తొలి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. అప్పట్లో ఆయన ఎన్నిక ఒక చారిత్రిక అంశంగా చెప్పుకున్నారు. ఆయన మండలా ధ్యక్షునిగా ఉన్న సమయంలో రామాంజనేయ కాలనీ సహా పలు కాలనీలను నిర్మించారు. కొత్తగూడెం పట్టణ విస్తృతికి కృషి చేశారు. జిల్లా పరిషత్ సమావేశంలో తనదైన బాణిలో సాంబశివరావు సమస్యలను ప్రస్తావించి పలువురి ప్రశంసలు పొందారు. 1999, 2004 ఎన్నికల్లో సుజాత నగర్ నుంచి పోటీ చేసిన ఆయన ఓటమి చవి చూశారు. 2009లో కొత్తగూడెం నుంచి అప్పటి మంత్రి వనమా వెంకటేశ్వరరావును ఓడించి శాసనసభకు ఎన్నికయ్యారు. శాసనసభలో సిపిఐ పక్ష ఉప నాయకునిగా పనిచేసిన కూనంనేని బయ్యారం సహా పలు సమస్యలను ప్రస్తావించి ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. బయ్యారం ఐరన్ ఓర్ పోరాటం సెగ కేంద్రాన్ని తాకిన విషయం ఉమ్మడి రాష్ట్ర ప్రజలు ఇంకా మరచిపోలేదు. 2014లో ఓటమి చెందిన కూనంనేని 2018 ఎన్నికల్లో సిపిఐ, కాంగ్రెస్ మధ్య అవగాహన ఉండడంతో కొత్తగూడెంలో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేశారు. 2023 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఐ ఒప్పందంలో భాగంగా సిపిఐకి కొత్తగూడెం స్థానం కేటాయించడంతో కూనంనేని బుధవారం నామినేషన్ వేయనున్నారు.

**పట్టణ కార్యదర్శి నుంచి రాష్ట్ర కార్యదర్శి దాకా :**

సాధారణ సభ్యునిగా కమ్యూనిస్టు పార్టీలో చేరిన కూనంనేని కొత్తగూడెం పట్టణ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షునిగా కూనంనేని పని చేస్తూ రైతాంగ సమస్యలపై అనేక ఆందోళనలు నిర్వహించడంతో పాటు అప్పట్లో ఆయన రైతాంగ సమస్యలపై రాసిన వ్యాసా లు పలువురిని ఆకట్టుకునేవి. 2004లో సిపిఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2009లో శాసనసభకు ఎన్నిక కావడంతో. కార్యదర్శి పదవి నుంచి తప్పుకున్నారు. 2018లో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన కూసంనేని 2020, 2022లో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక య్యారు. ప్రస్తుతం జాతీయ సమితి సభ్యులుగా, రాష్ట్ర కార్యదర్శిగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులుగా పని చేస్తున్నారు.

**నామినేషన్ కార్యక్రమానికి హాజరు కానున్న ప్రముఖులు :**

కొత్తగూడెంలో బుధవారం జరగనున్న కూనంనేని సాంబశివరావు నామినేషన్ కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, కాంగ్రెస్ ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కాంగ్రెస్ నాయకులు పోట్ల నాగేశ్వ రరావు, నాగా సీతారాములు, సిపిఐ నాయకులు పోటు ప్రసాద్, బి.అయోధ్య, రావులపల్లి రాంప్రసాద్, సిపిఎం నాయకులు కనకయ్యతో పాటు టిజెఎస్ ఇతర ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు హాజరు కానున్నారు.